# గడియారం

రామానగర్‌లో గంగాధరం గడియారాల వర్తకుడు. బజారులో పెద్దషాపుకూడా వుంది. ఆవూరులోనివారు నమ్మికచే గడియారాలు కావలసి వస్తే అతని దగ్గరే కొంటుంటారు. అతని చేతిక్రింద యిద్దరు గుమాస్తాలు బ్రతుకుతున్నారు. యిద్దరిలోను జగన్నాథం అతని దృష్టిలో నమ్మదగినవాడుగా గుర్తింపబడ్డాడు. అందుకే కాబోలు గంగాధరం లేకపోయినా జగన్నాథం తన చేతిమీదుగా వర్తకం సాగిస్తూ వుంటాడు. కొన్నాళ్లకు జగన్నాథంలో మార్పు కనిపెట్టాడు గంగాధరం. షాపులో సరుకు తరిగిపోతోంది కాని గల్లాపెట్టిలో మాత్రం పెరుగు కనిపించలా. దీనికి కారణం జగన్నాథమే అని తలపోశాడు గంగాధరం. జగన్నాథం చేతిలోనే డబ్బుంచేది. గంగాధరం లెక్క చూచి సరిపెట్టుకున్నాడు జగన్నాథాన్ని. కాని జగన్నాథం తగిన సంజాయిషీ యివ్వలేకపోయాడు. జగన్నాథం నేరస్థుడని ఋజువు చేసుకో తలచాడు గంగాధరం.

ఒక రోజున జగన్నాథం బావమరిది శ్రీనివాసరావు ఆవూరు వచ్చాడు. శ్రీనివాసరావుదగ్గర జగన్నాథం యిదివరకు కొంతడబ్బు బదులు తీసుకున్నాడు. ఆడబ్బు కోసం వచ్చాడు శ్రీనివాసరావు.



జగన్నాథం కొంత డబ్బు సరిపెట్టాడు. తతిమా డబ్బు బదులు గడియారం ఒకటి యిస్తానన్నాడు జగన్నాథం. ఈ సంగతి కొందరి ద్వారా గంగాధరం తెలుసుకొన్నాడు. సామాను డెలివరీ కోసం స్టేషనుకు వెళ్లాడు రెండో గుమాస్తా. కొట్లో జగన్నాథం ఒక్కడే వున్నాడు. శ్రీనివాసరావు షాపు దగ్గరకు రావటం చూచాడు గంగాధరం. గంగాధరం రహస్యంగా షాపు గోడ ప్రక్కనే నుంచుండి జరిగే సంగతి చూస్తున్నాడు. తనకు వచ్చిన సమాచారం నిజమే. జగన్నాథం గడియారం యివ్వటం, శ్రీనివాసరావు తీసుకు వెళ్లటం జరిగింది. వెంటనే షాపులోకి వెళ్లి వాళ్లిద్దర్ని పోలీసులకు పట్టిద్దామనుకున్నాడు. తొందర కూడదనుకుని పోలీసులకు రిపోర్టు యిస్తే వాళ్లే చెక్ చేసి వాళ్లిద్దర్ని అరెస్టు చేస్తారనుకున్నాడు గంగాధరం. పోలీసులకు రిపోర్టిచ్చాడు. పోలీసులు వచ్చారు. గడియారం శ్రీనివాసరావుకి జగన్నాథం యిచ్చినట్లు సాక్షులు ఎవరూ లేరు. తనకు తనే సాక్షి. అంచేత క్రిమినల్ చర్య తీసుకోవటానికి వీలులేదన్నాడు సబిన్స్పెక్టరు. సామాను డామేజికి మాత్రం రిపోర్టు యివ్వమన్నాడు. అతడు చెప్పినట్లు రిపోర్టు యిచ్చాడు గంగాధరం.

మున్సబు కోర్టులో కేసు రిజిష్టరు చేయబడినది. నాలుగు మూడు వాయిదాలు జరిగినై. మున్సబుగారు ఆఖరి వాయిదా వేశారు. గంగాధరం ప్లీడరుగారికి వాయిదా రెండు రోజులుందనగా జ్వరం వచ్చేసింది. ప్లీడరుగారు రాలేకపోయారు. ఇంకో ప్లీడరును పెడితే ఆయనకు కూడా ఫీజు యివ్వాల్సివస్తుందని ప్లీడరును పెట్టడం మానేశాడు గంగాధరం. తనే వాదిద్దామనుకున్నాడు గంగాధరం. జగన్నాథం పేరు మోగిన ప్లీడరు రామారావుగారిని పెట్టాడు తన తరఫున. ప్రాక్టీసుకని రామారావుగారు జగన్నాథంచేత రిహార్సల్స్ వేయించాడు బెదురు లేకుండా మున్సబుగారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పటానికి. కోర్టులో దైవసాక్షిగా ప్రమాణం చేయాలని జగన్నాథంతో చెప్పారు రామారావుగారు. ప్రమాణం చేయటం దేవుని ఎదుట అబద్ధం ఆడటం కాగలదనీ అందుచేత ప్రమాణం చేయలేనని చెప్పాడు జగన్నాథం. ప్రమాణం చేయకపోతే కేసు నెగ్గదని చెప్పారు ప్లీడరుగారు. ప్రమాణం చేయకుండా కేసు నెగ్గిస్తే అదనంగా డబ్బిస్తానని ఆశచూపాడు జగన్నాథం. ప్లీడరుగారి బుర్రకొక ఆలోచన తట్టింది. మున్సబుగారు అడిగే ప్రతిప్రశ్నకు 'మెహా' అని మేక అరచినట్లు అరవమని చెప్పారు ప్లీడరుగారు. ఈ ఎత్తుకు చాలా సంతోషించాడు జగన్నాథం.

కోర్టు తెరచారు. మున్సబుగారు కుర్చీలో ఆసీనులైనారు. జగన్నాథం గంగాధరం బోనుల్లో ఎక్కారు. జగన్నాథం చాల రోజులనుంచీ తన దగ్గర గుమాస్తాగావుండి యిప్పుడు తన కొట్లో గడియారాలు ఎన్నో కాజేశాడని, మొన్న తన ఎదురుగా ఒక గడియారం తీసి శ్రీనివాసరావుకిచ్చాడని, దగా, మోసం చేసిన ఈ నేరస్థుణ్ణి కఠినంగా శిక్షించాలి అని చెప్పాడు గంగాధరం మున్సబుగారితో.

'సాక్షులు ఎవరూ లేరా!' అని ప్రశ్నించాడు మున్సబుగారు. 'లేరు' అని చెప్పాడు గంగాధరం.

మున్సబుగారు జగన్నాథాన్ని ప్రమాణం చేయమన్నారు. 'మెహా' అని మేక అరుపు ఒకటి వినిపించింది. యింకోసారి అడిగారు. తిరిగి ఆ అరుపే వచ్చింది సమాధానంగా. అపనింద మోపి తనను వీధిమీద కెక్కించినందుకు జగన్నాథం చాల విచారపడ్డాడని, మతిపోయిందని చెప్పారు రామారావుగారు కుర్చీలోంచి లేచి నిలబడి.

అంతా విచారించి కేసు కొట్టేశానన్నారు మున్సబుగారు.

జగన్నాథం మొహం చాటంతయింది. గంగాధరం మొహం చిన్నబోయింది. న్యాయస్థానాల్లో న్యాయమని తీర్పునిస్తూ, అన్యాయాన్ని న్యాయంకింద చెల్లుబడి చేసే తీర్పుదారులను తిట్టాడు గంగాధరం.

కోర్టువారు ఫలహారాలకు లేవగానే కోర్టునుంచి కాంపౌండు బయటకు వచ్చాడు జగన్నాథం. ప్లీడరుగారు వెంటబడ్డారు.

'నా తెలివి తేటలతో నీ ఆపద రక్షించా! కనుక నువ్వు నన్ను సంతోష పెట్టు' అన్నారు ప్లీడరు రామారావుగారు.

'మెహా' అని దీర్ఘంగా అరవు అరచి యింటికి చక్కా పోయాడు జగన్నాథం.

★